ఇతఃపూర్వం కనీవినీ యెరుగని సరిక్రొత్త సృష్టే పుడుతుందో?
ఒకవేళ పునస్సృష్టిలో మనుష్యావతారమే ఉండదిచో
భవిష్యల్లోక చరిత్ర ఎవరివల్ల ఏరూపం తాల్చుతుందో?
ఇవి యిదమిత్థమని నిర్ణయింపరాని సంశయాలు
సంశయాత్మా వినశ్యతి అన్నవాడెవడో అసాధ్యుడల్లేనే వున్నాడు
అభ్యుదయం, అధివాస్తవికతా అంటో ఆరాటం చెందే
నీవూ నేనూ వున్నంతవరకూ
సంశయాలూ తప్పవు! వాడెవడో చెప్పినట్లు వినాశనమూ తప్పదు
ఆద్యంతాలు కనిపించనిదానికి అంతూపంతూ దొరకదు
కాలగర్భంలో కలిసిపోయిన ఘట్టాల వాసనలు
వర్తమానానికి ఆకారం యిచ్చి
భవిష్యత్తుకు ఆశాపాశాలు చూపుతవి
భూతంనుండి వర్తమానమూ, దానినుండి భవిష్యత్తూ
ఖచ్చితంగా విడదీయటం కష్టసాధ్యమూ, అసాధ్యమూ కనుక-
కాలాన్ని మూకవుమ్మడిగా యేకవస్తువుగా పరిగణించాలి
అట్లు జరుగనినాడు-
నా గుండెలలో కదలే, నా కన్నులలో మెదలే
శతాబ్దాల చరిత్రల సంపుటాలు-
గతానేక సంఘటనల విప్లవాల విషాదాంత వినోదాలు-
నాలోనే ప్రతిధ్వనించి నానావ్యాకర్ణనీయా లవుతవి

---

కథానిక

# కనువిప్పు

**ఆర్. యం. చిదంబరం**

బయట కాలింగ్ బెల్ గణగణమంది—

ఏదో నవల చదువుతూ సర్వం మరిచిపోయిన శారద గబగబా వెళ్ళి తలుపు తీసింది.

ఓ చేత్తో హాండ్ బాగ్-మరో చేతిలో చిన్న గొడుగు— కళ్ళజోడు - కాళ్ళకు స్లిప్పర్లు—ఈ వేషంలో ఎదురుగా ఓ అమ్మాయి నిలబడుంది. పరీక్షగా చూసిన శారదకు ఆ అమ్మాయి విశాల ఫాలంమీద - ఒంటరిగా ఆకాశంలో వున్న నక్షత్రంలా నల్లటి చిన్న బొట్టు కనిపించింది. ఆమెను చూస్తూ శారద అలాగే నిలబడిపోయింది.

ఆమె మెదడులో కొరియా యుద్ధంలా జరుగుతున్న మధన ఫలితంగావచ్చినది యెవరో తెలియ లేదు.

ఆ వచ్చిన అమ్మాయి కొంటెగా లిప్‌స్టిక్ రాసుకున్న ఎర్రటి పెదవులు చెక్కిళ్ళకు సంధ్యారాగం పూస్తుండగా నవ్వింది—చేత్తో విలాసంగా ఓసారి గొడుగును వృత్తాకారంలో తిప్పి నెమ్మదిగా కళ్ళజోడు తీసింది. శారద ఏదో కొత్త లోకంలో వున్నట్టు ఫీలయింది.

"ఏం శారదా!...అలా జంతువును చూసినట్టు చూస్తావే...నన్నెరగవూ?" అంటూ వెన్నెల పులకరించినట్టు నవ్వింది.

శారద తన మీననేత్రాల్ని పెద్దవి చేసి ఆమె యెవరో తను గుర్తుపట్టలేక పోయానని ముఖ కళవళికలలో స్పష్టం చేసింది.

"నేను సుశీలను. అప్పుడే మర్చిపోయావు...

అంటే, ఈ సంసారంలో పడితే మన మెవరో మనకి తెలియదు." శారద అనుకోకుండా నవ్వేసింది. మూడుసార్లు గోడలమీద కెక్కిన సుశీల పేరు! ఆ నామధారి, సుశీల జ్ఞప్తికొచ్చారు.

"సారీ. సుశీలా! నీ వేషం చూసి పోల్చుకోలేక పోయాను. అదీకాక చూసి చాలా కాలమైంది. చాలా మారిపోయావు. ఆ సుశీలకూ, ఈ సుశీలకూ పోలికేది? మరేమనుకోకు. నిన్ను మర్చిపోగలనూ?" అంటూ చేయి పట్టుకుని చరచర లాక్కెంటూపోయి సోఫాలో కూర్చోమని ఆమె కెదురుగా కూర్చుంది శారద.

"ఎక్కడుంటున్నావు? ఏవిటి సంగతి? సంసారం గురించి అంత విరక్తిగా మాట్లాడుతున్నావు. నువ్వింకా దిగలేదేవిటి?" అనడిగింది శారద.

సుశీల అడిగినదానికి సమాధానం చెప్పకుండా ఆ గదంతా ఓసారి కలయచూసి మనోనేత్రంతో తలిమ్మా ఇల్లంతా చూసింది.

"మీ ఆయన పెద్ద వుద్యోగస్తుడట. మరిలాంటి యింట్లో వుంటున్నారే?"

ముఖం నిండా అసంతృప్తి రేఖ లలుము కున్నాయి.

"ఏం! ఈ యింటికేం? దివ్యంగా వుంది. ఇంతకంటె పెద్ద యిల్లు వుండాలేవిటి? మా యింటో పెద్ద మందేదీ లేదు!"

శారదకు తన ప్రశ్న నచ్చలేదని గ్రహించుకున్న సుశీల "అందుకే అన్నా-సంసారంలో పడితే మన మెవరో మనకు తెలియదని."

ఇంతలో లోపలనుండి కెవ్వుమని కేక-ఉయ్యాల కొద్దిగా వూగటంవలన కిర్రుమనే చప్పుడు-వినిపించాయి. సుశీల చికాగ్గా నవ్వుతూ శారదకేసి చూసింది. లోపల కెళ్ళిన శారద ఐదు నిమిషాలు గడిచాక తిరిగి వచ్చింది. ఈ ఐదు నిమిషాలూ వుయ్యాల వూగుతూనేవుంది.

"మనం మాటాడుకుంటుంటే లేచాడు గా మోలు-కొంచెం నెమ్మదిగా మాట్లాడుకోవాలి. మరే మనుకోకు..."

శారద క్షమించమన్నట్టు చూసింది.

సుశీల పెద్దగా నిట్టూరుస్తూ "ఈ పిల్లలంటేనే మహారోత-ఆడది వంటింటి కుందేలైపోయింది. పిల్లలు-మొగుడూ-వంట ఇది తప్పితే స్వతంత్రం కాని బయటి ప్రపంచం కాని వుండదు. ఛీ... నువ్వు బి.ఏ చదువుకుని ఏంలాభం?...నాకు సిగ్గు చేటుగావుంది. అక్షరం ముక్కరాని ఆడదానికీ నీకూ తేడా యేవిటి?" అంటూ లెక్చరు మొదలెట్టింది. ఆనాడు కాలేజీ డిబేట్లలో మొగాళ్ళముందర నిలబడి ధీమాగా మాట్లాడగల్గిన లేడీ స్టూడెంటు ఒక్క సుశీలే అన్న సంగతి శారదకు హఠాత్తుగా జ్ఞప్తికొచ్చింది.

"అదేవిటి సుశీలా!...అలా గంటావు?... పిల్లలులేని యిల్లు కలకల లాడుతుందా?...పిల్లలుంటేగా ఇంటికి కళ" అని నొచ్చుకుంది శారద.

"నువ్వు బి.సి. లో ఉన్నావు. ఇది ఇరవయ్యో శతాబ్దం. ఇంత మంచి సినిమా లాడుతున్నాయి కదా? ఎన్ని చూశావు?...బిగ్ కార్నివాల్ చూశావా?...ఐవాన్ హో?... నేను వారానికి రెండు సినిమాలు చూస్తాను..."

"సరే లే-ఆ సంగతికేంగాని ఇప్పుడు నువ్వేం చేస్తున్నావు?"

"నేను సామీ అండ్ కోలో టైపిస్టుగా వుంటున్నా. నూటయాభై రూపాయలు జీతం—మేనేజరుకు నేనంటే ఎంతో ఆదరణ! ఎంత హాయిగా వుంటున్నాననుకున్నావు? నీలాగ తొందర తొందరగా పెళ్ళి చేసుకుని గంపెడు పిల్లల్ని కని-ఎప్పుడూ వాళ్ళతో వేగుతూ అటు మొగుడి కోపానికి లోనగుతూ బాధపడటంలేదు. నా యిష్టంవచ్చినట్లు నడచుకుంటాను. రోజూ బీచ్ కిపోతాను—అదీ జీవితమంటే-ఇప్పటికైనా గ్రహించుకో" సుశీల పెదవులమీద గర్వసహిత మందహాసంనాట్యం చేసింది. విలాసంగా ఓసారి కళ్ళజోడు తిప్పింది.

"సరే లే!...ఇప్పుడవన్నీ ఎందుకు?...నువ్వు స్వేచ్ఛగా వుండటం నా కెంతో సంతోషం."

సుశీల కాశాజ్యోతి ఆమ్లజనిలో మునిగినట్టయింది ఉత్సాహంతో అంది: "నువ్వుకూడా నా లాగే వుద్యోగం చెయ్యకూడదూ? మా ఆఫీసులోనే యిప్పిస్తా...ఏదైనా క్లర్కు-అంతే కాని యీ చెరసాల బ్రతుకెందుకు? చదువుకున్న దానివి..."

పిల్లాడు మళ్ళీ ఏడ్చాడు.

శారద కీసారి నిజంగా కోపంవచ్చింది. సుశీల పోసిన మందు తాలూకు నిషా బాగా పనిచేసింది. కాస్సేపు లాలించింది. ఏడుపు మానకపోయేసరికి వీపుమీద ఛెళ్ళుమని వేసింది-దాంతో సుశీలకు వెంటు లెగిరిపోతాయని అనుమానం కలిగింది. చేతివేళ్ళు చెవుల్లోకి దోపింది.

తరవాత ఎన్నో సంగతులు మాట్లాడుకున్నారు.

"శారదా!...ఇదుగో నా ఎడ్రసు-నీ ఉద్యోగం కావాలంటే నా దగ్గరకురా-తరవాత నీ యిష్టం."

శారద అందుకుంది.

సుశీల వెళ్ళిపోయింది.

* * *

రవణ ఆఫీసునుండి వచ్చేసరికి ఆరైంది. ఇద్దరు స్టెనోగ్రాఫర్లు సెలవు పెట్టటంవలన ఆతనికివర్కు ఎక్కువగావుంది. అందుకే ఆలస్యం. రాగానే అంతా మరిచి కుర్చీలో కూర్చుని క్షణం కళ్ళు మూసుకున్నాడు. అలవాటు ప్రకారం టేబిలు కాఫీ రాలేదు. శారద తను రావటం చూసింది. మరి నిర్లక్ష్యానికి కారణం? అతనికిబోధపడలేదు శారదకు కోపం వచ్చుండాలి. ఐతేకోపం ఎందుకని?

ఆశతో కిందటినెల అడిగిన గ్రేప్ సిల్కుచీర-రింగూ-సెట్టూ-సుందరంగాడికి పంజాబీ డ్రస్సు-తన మక్కువకోలదీ టిష్యూ చీర అన్నీ వారంరోజుల క్రితమే కొన్నాడు. వాళ్ళతమ్ముడుకి కాలేజీఫీజు యాభైరూపాయలు పంపించాడు. బాగా అలిసిపోయిన కారణంచేత ముక్కుమీదున్న కోపం కాస్తాకిందకు జారింది.

"శారదా!..." అని పిలిచాడు.

ఆ పిలుపులో ధ్వనించిన అర్థాలేవిటంటే-

భర్త వచ్చి యింతసేపయింది "కాఫీ"అన్నా యిచ్చావుకాదు-

నాకు కోపం వచ్చిందంటే మనిషినికాను. ఈ నాలుగేళ్ళలో జరిగిన ఇలాంటి కొన్ని సంఘటనలను జ్ఞప్తికి తెచ్చుకో-

నీ కోరికలన్నీ తీర్చాను. ఇంకాకోపమెందుకు? కాస్త నయంతో కూడిన వినయం.

అన్నీ అర్థం చేసుకున్న శారద గబగబా కాఫీ తీసుకొచ్చి పర్వతం బద్దలైనట్టు టేబిలుమీద వుంచింది. స్త్రీ అంటే ప్రళయానికి రూపాంతర మనుకున్నాడు రవణ.

"శారదా?... సుందరం ఏడీ?" అన్నాడు టేబిలు దగ్గర కూర్చుని ఆడుకుంటున్న బాబుకేసి నవ్వుతూ చూస్తూ-ఓ నిమిషం శారద మాట్లాడలేదు,

"బయటికెళ్ళాడు గాబోలు. ఆడుకోటానికి"

'గాబోలు' అన్నపదం వికృతంగా వింతగా వినిపించింది. రవణ కాఫీతాగాక మాట్లాడకుండా 'పత్రిక' విప్పాడు.

"ఇందాకా నా ఫ్రెండు సుశీల వచ్చింది."

"ఓ!... ఆ అవతారమా?... ఏమందేవిటి? స్త్రీ స్వాతంత్ర్యం మందేమన్నా నూరిపోసింది గాబోలు"అంటూ నవ్వేశాడు.

"ఏం!... మీ రెరుగుదురా?" శారద విస్తుపోతూ అడిగింది.

"ఇంత పెద్ద పట్నంలో ఎక్కడపడితే అక్కడ కనిపిస్తుంది—మా ఆఫీసు ఫ్రెండొకడు సుశీల క్లాస్‌మేటు-పరిచయం కూడా చేశాడు... ఎక్కడో అమెరికాలో పుట్టాల్సింది..."

"చూడండి... వాళ్ళ ఆఫీసులో ఖాళీవుందట నన్ను ఎప్లై చెయ్యమంటోంది—చేసేదా?... నేను చదువుకున్నందుకు ప్రయోజనమేవిటి?"

శారద ఎప్పుడూ ముక్తసరిగా మాట్లాడుతుంది. ఆమె చదువుకున్నది సంస్కృతం కనక అస్తమానం సంస్కృత కవులకుమల్లే అలంకారాలతోనే మాట్లాడుతుంది. ఉపమ శ్లేషాలంకారాలు తరుచుగా దొర్లుతాయి. అటువంటి శారద అగ్ని పర్వతం బద్దలైనట్టు మాట్లాడిన మూడు ముక్కల్లోను లావా ప్రవహించింది. రవణకు లోపల బాధగా వున్నా పైకి నవ్వేసి తలవెనక్కి వేలాడేసి "నీ యిష్టం-నాకేం అభ్యంతరంలేదు. మీ అమ్మకో మా అమ్మకో వుత్తరంరాస్తే వచ్చి పిల్లల్ని చూసుకుంటారు. ఈ యుగంలో భార్యలను అదుపులో పెట్టడం భర్తలకు సాధ్యమా?" శారద మూతి ముడుచుకుంది.

శారద మాటవరస కడిగిందనుకున్నాడు రవణ. సుశీల అరచేతిలో స్వర్గం చూపించింది. ఐనా పిల్లలంటే శారదకు మాచెడ్డ విసుగు. అస్తమానం వాళ్ళవెంట రక్షకభటుడిలా తిరుగుతూవుండాలి.

ఏ మాత్రం జలుబు చేసినా రవణ కంగారు పెట్టేస్తాడు. పెళ్ళిచేసుకోటం మొదటి తప్పు.

శారదకు హఠాత్తుగా ఓనాటి సంఘటన జ్ఞప్తికొచ్చింది. సినిమా చూస్తోంది. కాసేపు మంచి పిల్లాడిలా కూర్చున్న బాబు హఠాత్తుగా ఏడవటం మొదలెట్టాడు. నానాహంగామా చేశాడు. అతన్ని బయటకు తీసుకెళ్ళి సముదాయించి తీసుకొచ్చేసరికి సుందరరి ఆ రాగాన్ని కంటిన్యూ చేశాడు. సినిమాసంగతి దేవుడికెరుక-అందరూ శారదకేసి కళ్ళెర్రచేశారు. ఊరుకున్న బాబు హఠాత్తుగా కిందకిదిగి పరుగెత్తటం మొదలెట్టాడు. అతన్ని పట్టుకొచ్చేసరికి తలప్రాణంతోకకొచ్చింది.

ఇంటర్ వెల్ వచ్చింది కనక బతికిపోయారు.

పుండుమీద కారంజల్లినట్టు వెనకవరసకుర్చీలో కూర్చున్న కాలేజీ అమ్మాయిల రిమార్కు వినిపించింది.

“ఇదిగో—కామేశ్వరీ...నువ్వు చిన్నపిల్లలాగున్నావు కాని చదువవగానే పెళ్లయితే ఆవిడకు మల్లేనలుగుర్నెత్తుకుంటావు...”

“నువ్వుమాత్రం ఎత్తుకోవేమిటి?”

అందరూ పకాలుమన్నారు.

శారదకు దేహమంతా మంటల్లో దహించుకుపోతున్నట్టనిపించింది- వాళ్ళందరికీ ఎంతస్వేచ్ఛ! ...తనకే ఈ బంగారుసంకెళ్ళు!

“ఛీ... వెధవసంసారం!” అనుకుంది.

శారదబాధకు తనూ కారకుడు కనక రవణ కూడా చాలా బాధపడ్డాడు.

శారద తను చదువుకున్నందుకు ప్రయోజనమేమిటని మళ్ళీ ఓసారి ప్రశ్నించుకుంది.

* * *

మరినాల్గు రోజులుగడిచాక కాలింగ్ బెల్ గణగణమంది-తలుపుతీయగానే సుశీలకనిపించింది. సుశీల ముఖంలో ఎక్కడా సంతోషంతాలూకు గుర్తులుకనిపించటంలేదు.

శారద ఆహ్వానించకుండానే సోఫాలోవచ్చి కూర్చుంది.

“అదేంసుశీలా!...అలాగున్నావు? మీఇంటికి వద్దామనుకుంటున్నా — నాకేదైనా ఉద్యోగం చూస్తానన్నావుకదూ?”

“అదిసరేలే!...మీ బాబేడీ?’’

శారద విస్తుపోయి నోరుతెరిచిచూస్తూ “ఏం? సంసారంమీద వుండేకోపంతో వాణ్ణి బయటకు విసిరేస్తావా?’’ అంది-సుశీల కృత్రిమపు నవ్వును పెదవులపై కల్పించి.

“నువ్వు ఆశ్చర్యపోతున్నావు—నా తత్వం మారినందుకు—ఇంటిదగ్గర ఇద్దరు పిల్లలున్నారు. మా నైబర్సనుకో-వాళ్లు నిన్న భలేగమ్మత్తుచేశారు. వాళ్ళలో చిన్నమ్మాయి వాళ్ళనాన్న కళ్ళజోడు తగిలించుకుని-జోళ్ళుతొడుక్కుని నేనుసుశీలగారికి మల్లే ఆఫీసుకు పోతున్నా-అంటూపోతుంటే వాళ్ల అన్నయ్య-చిన్నకుర్రాడే ననుకో-నీకు సిగ్గులేదూ? ఊరంటుపడి తిరుగుతావా? అంటూ నిజంగా బాదేశాడు - అదో పెద్ద రభసైపోయింది-ఇలాంటివెన్నో చేశారు. నా సైకాలజీ మారిపోయింది.’

“వాడు నిద్రపోతున్నాడు—మరి నా జాబ్ మాట?”

“ఊరికే అన్నా-ఇలాగే వుందూ-ఉద్యోగం చేస్తే ఎన్ని బాధలనుకున్నావు? మా మేనేజరు వున్నాడే! వాడు మంచివాడన్నానుకదూ? మొన్న ఏవో కాయితాలు టైపుచెయ్యాలనిపిలిచి ఏదేదో అన్నాడు-రాస్కెల్-స్కౌండ్రల్ - మా ఆఫీసులో గుమాస్తాలంతా నేను వాడికి లొంగిపోయానని అంటున్నారు-నిన్ననే విన్నా-వాడి పెళ్ళాం పుట్టింటికి పోయిందట. ఇంకా ఏవేవో అనుకుంటున్నారు. నవ్వుకుంటున్నారు. అవన్నీ యెందుకులే- నే రాజీనామారాసి వాడిమొహాన కొట్టాను. ఇంక ఉద్యోగం చేయటమే మానేస్తాను. మా అమ్మమ్మరోజూ కొరుక్కుతింటోంది. వెధవుద్యోగాలు—మనకెందుకు?” అనేసి నవ్వేసింది.

ఉయ్యాలలో నిద్రపోతున్న బాబును ముద్దుపెట్టుకుని సుశీల వెళ్ళిపోయింది.

శారద నవ్వుతూ నిట్టూర్చింది. సినిమాల్లో నటించాలని ఆ వూరువచ్చే యువతులు కొందరు శారదకళ్ళ కప్రయత్నంగా కనిపించారు. “మళ్ళీ సుశీల కనిపించినప్పుడు ఆమె వేషమెలాగుంటుందా?’’ అని ఆలోచించసాగింది. ★